# కుక్కల బండి

అతను నడుస్తున్నాడు, నీరసంగా

అతను -

వృద్ధుడేమీకాదు. యువకుడే. ఇతవయ్యేడేళ్ళ యువకుడు ! మరి - ఆ నీరసమేమిటి? ఎందుకు?

ఆశ ఎండిపోయింది బతుకులో రేపటి గురించి ఆత్రంగా చూసేందుకు ఏమీ మిగలలేదు. అందుచేత నిస్పృహ. నిరాశకంటె, బాధకంటె, భయంకంటె బద్ధ శత్రువొకటుంది మనిషికి. అది - ఆకలి ! తక్షణ శతృవు.

ఇప్పుడతను ఒక ఇంటర్వ్యూనుంచి వొస్తున్నాడు.

ఉద్యోగంరాదని ముఖంమీదే చెప్పేసినట్లే. ఎందుకంటే అభ్యర్థి కులము... రికమండేషను... యివ్వగలిగే లంచమూ యివే అడిగారు ఇంటర్వ్యూ అధికారులతినిర్భయంగానూ - నిస్సంకోచంగానూ... చేయవలసిన గుమస్తా ఉద్యోగానికి ఏ విధంగానూ అక్కరలేని జింబాబ్వే... నికరాగూల గురించి, గుండె రోజుకి ఎంతరక్తం పంప్‌చేస్తుంది... కాదంబరి వ్రాసిందెవరు? వంటి ప్రశ్నలు వేయనందుకు సంతోషించాలో,ఉద్యోగానికి అలాగే సంబంధించని అర్హతలయిన కులమూ, సిఫార్స్ ఉత్తరాలు తెచ్చుకునే పలుకుబడి, లంచ మివ్వగలిగే స్తోమతలను తరచితరచి అడుగుతున్నందుకేడవాలో తెలియక... ఫలితం ముందే తెలిసిపోతున్నా ఎలాగో ఇంటర్వ్యూ అయిపోయిందని పించుకుని బయట పడ్డాడు.

"నీ ఇంటర్వ్యూలకీ వ్రాత పరీక్షలకీ యిక మదుపు పెట్టడం నా తరం కాదు. నీ చదువుకి పెట్టిన దానితో నీ చెల్లిలికి ఘనమైన సంబంధం తెచ్చి పెళ్ళి చేయగలిగేవాడి ని.నీ ఇంటర్వ్యూలు... వ్రాత పరీక్షలు... దరఖాస్తు ఖర్చులూ... పోస్టల్ ఛార్జీలు... ప్రయాణం ఖర్చులూ వీటితో కిరాణా కొట్టుపెట్టుకుంటే నెల నెలకీ ఉద్యోగం వల్ల వచ్చేజీతం కంటె కొట్టుమీద వారం వారం ఎక్కువ లాభం వచ్చేది.

చేసిన తెలివి తక్కువ పని చాలు ఇంక ఇంటర్వ్యూలూ వొద్దు. ఏమీ వద్దు నన్ను పైసా అడక్కు ఇంతవరకూ నీకు చేసిందే ఎక్కువ" అన్నాడు.

ఎవరో కాదు. కన్నతండ్రి! ఎవరినో కాదు. ఎమ్మే ఎకనామిక్స్‌ని! ఇంకానా, యిటుపై సాగదని కచ్చితంగా నిర్ద్వంద్వంగా చెప్పేశాడు. ఔను ఆయన తప్పు ఏమాత్రం ఏముంది? మనిషి సహనానికి హద్దుంటుంది. తండ్రిగా కొడుకుని చదివించాడు. ఉద్యోగ ప్రయత్నాల కోసం పెట్టుబడి పెట్టాడు మళ్ళీ. కాని పెట్టుబడి అంతా గోడకి వేసి సున్నమవడమే తప్ప రిటర్న్ రావడం లేదు కొంచెమయినా.

"ఏం మిస్టర్!... చావాలనుకుంటే ఏ రైలో ఎక్కి ప్రయాణంచెయ్. నాలారీయే దొరికిందా?"

డ్రయివర్ తిట్టడంతో రోడ్డుమీంచి పక్కకు గెంతాడు. గెంతి, లారీ వెళ్ళిపోయాక అప్పుడు పశ్చాత్తాపపడ సాగాడు.

అయ్యో! ఆ లారీ తనమీంచి వెళ్ళిపోతే ఎంతబాగుండేది!హాయిగా చచ్చిపోయేవాడు, ఏ సమస్యాలేకుండా. నాన్నకి తననుంచి రిటర్న్ వొచ్చినా, రాకపోయినా తనని పోషించవలసిన ఖర్చేనా తప్పేది. ఈ అనామకుడికి చావు కూడా సులభంగా సాధ్యపడదేమో!

బియిల్‌నోన్ రాదర్ దేన్ అన్‌నోన్. (అనామకుడిగా మిగలడంకంటే చెడ్డపేరు తెచ్చుకోవడమయినా నయమే) అన్న విలియమ్ హాజ్‌లిట్ గానీ; నరుడు నరుడౌట ఎంతో దుష్కరము సుమ్ము అన్న రామిరెడ్డి గారు గానీ జ్ఞాపకం వొచ్చినట్లు లేదు. వొస్తే అతనూ మరో కవితాభాగం చెప్పుకుని వుండేవాడు మనసులో.

హఠాత్తుగా అతని వెనుక నుంచి... భౌ భౌ... కుయ్యో... కంయి... ఒకటి రెండు... పదుల కంఠాలు. దీనంగా, జాలిగా, భయంగా, ప్రాధేయపడుతున్నట్లు, ఏడుస్తున్నట్లు... రక్షించమంటున్నట్లు...

అతను తృళ్ళిపడ్డట్లు అయి అటు చూశాడు.

కుక్కల బండీ !

నాలుగుటైర్లమీద బోనులా... ఇనుప ఊచలతో బండికానా, ఆ బండిని ఒక మునిసిపాలిటీ ఎద్దు లాగుతూంది. ఆ బోనులో బిలబిలలాడుతూ కుక్కలు, కుక్కపిల్లలు, కుక్క పెద్దలు, ఆడ కుక్కలు, మగ కుక్కలు... బోనునిండా కుక్కలే. కొన్ని పడుకుని, కొన్ని నిలుచుని, కొన్ని బోనులోంచి బయటపడాలనుకుంటున్నట్లు సందులలోంచి మూతులు బయటకు పెడుతూ, కొన్ని బోను ఊచలను గీరుతూ... కోపంగా, దీనంగా, భయంగా, బాధగా అరుస్తూ, అస్తిమితంగా అటూ యిటూ తిరుగుతూ, బోనుమీదికి ఎగుబడుతూ, కుయ్యోమంటూ, కంయిమంటూ...

ఆ బోనుకొక చిన్నగేటుంది. ఆ గేటుకీ ఇనుప ఊచలే వున్నాయి. ఆ గేటు కివతల బండి అంచున ఒక మనిషి నిలుచున్నాడు. వాడి చేతిలో సూదిమొన కల్గిన యినుప ఊచవుంది. ఆ కుక్కలగోల... ఏడుపులు భరించలేనట్లు వాడు ఆ వూచతో బోనులోపల గొడవ చేస్తున్న కుక్కలను, పిల్లల్ని కొట్టే మాస్టారిలా శిక్షిస్తున్నాడు. అల్లరి చెయ్యకుండా డిసిప్లిన్డ్‌గా, నోరుమూసుకు పడుండమన్నట్టు తిరగబడుతున్నాయి కొన్ని కుక్కలు. వాటికి ఊచకోతలు... గాయాలు. వాటి మూతిమీద రక్తం, నోటిలోంచి రక్తం...

నిరుద్యోగికి కడుపులో దేవినట్లైంది. ఆ కుక్కల ఆర్తనాదాలకీ, వాటి నుంచి కారుతున్న రక్తధారలకీ...

అతనికి జాలివేసింది.

భయం వేసింది.

అనుమానమూ వొచ్చింది.

అతను తనకు తెలియకుండానే ఏదో అదృశ్యశక్తి నడిపిస్తున్నట్లు ఆ బండి వెంట నడవసాగాడు... ఎందుకో ఎక్కడికో తెలియకుండానే. ఆ బండిలో వినపడుతున్న అరుపులు, కనబడుతున్నకుక్కల భాగాలు...

ఒక జంక్షన్ లాంటి చోట బండి ఆగింది. అది మెయిన్‌రోడ్డు కాదు. ఇక్కడ భవనాలు లేవు. చిన్నచిన్న యిళ్ళున్నాయి. అక్కడ డబ్బు కాని... ఖరీదయిన మనుషులు కాని ఉన్నట్లు లేరు. మామూలు

సామాన్య మనుషులే ఉన్నట్లున్నారు. అక్కడ బండి ఆగడమేమిటి, కుర్రాళ్ళు పరిగెత్తుకు రాసాగారు. పదినుంచి పద్దెనిమిది మధ్య వయసుకల ఐదారుగురు కుర్రాళ్ళు, కుక్కల బండిని, బండివాడిని చూస్తూనే వాళ్ళకి ఉషారు వొచ్చినట్లుంది. ఈల వేశారు. తాళాలూ అవీ తీసుకున్నారు.

"ఈసారిన్నాళయి పోయిందేమో." ఉచ్చులు చూసుకుంటూ అడిగారు. బండివాడు కారణం చెప్పలేదు. మందహాసం చిందించి విలాసంగా సిగరెట్ అంటించి బండీ దిగి నిలుచున్నాడు. త్వరపెడుతున్నట్లు వారి వేపు వొక్క చూపు చూశాడు. కుర్రాళ్ళు నలుమూలలా చెదిరిపోయారు కొన్ని నిముషాలు...

కలకలం...

గోల...

ఆర్తనాదాలు... వీధంతా కుక్కల అరుపులే.

బోనులో కుక్కలవి కావు.

బోను బయట కుక్కలవి రోడ్లమీద కుక్కలవి.

కుర్రాళ్ళు ఒక్కొక్కడూ ఒక్కొక్క కుక్కనూ తెచ్చి బండి వాడికందిస్తూన్నా తాడు చివర, అది రుంజుకుంటూనే రాగం పెడుతోంది/ రక్షించమంటూ ఏడుస్తూంది. దీనంగా చూస్తూంది.

ఐనా బండివాడు జాలిపడడంలేదు దానిని పట్టించుకోకుండా బోను తలుపు తెరిచి చాకచక్యంగా లోపలి కుక్కలు బయటకు రాలేకుండా కొత్త కుక్కని లోపలికి తోసేస్తున్నాడు. పొడవయిన అంకుశం లాంటి ఆయుధాన్ని ఉపయోగిస్తున్నాడు.

"మరచిపోయావు... నావి మూడు" హెచ్చరించాడు అ కుర్రాడు.

"ఔనులే"

కుర్రాళ్ళు కుక్కలని పట్టితెస్తున్నారు, లెక్క చెబుతున్నారు. బండివాడు వాటిని బోను లోపలికి తోసేస్తున్నాడు.

అతనికి – నిరుద్యోగికి – ఏమీ అర్థం కావడంలేదు – ఏమిటిదంతా? ఎందుకు? ఏమిటో... ఎందుకో... తెలియకుండానే ఎంతగా గుండెల్లో దేవేస్తుంది కుక్కలబండి !

అతను – బండీవాలా వేపు నడిచాడు.

"బ్రదర్" మెల్లిగా పిలిచాడు భయపడుతూనే.

"వాట్ డు యు వాంట్" అడిగాడు బండీవాలా.

నిరుద్యోగి నివ్వెరపోయాడు. ఇతను... వీడు... కుక్కల బండీవాడు – ఇంగ్లీష్ మాట్లాడతాడేమిటి? అందులోనూ ఎంగిలిముక్కలలా కాకుండా చక్కని... సరయిన ఉచ్చారణతో

అంతలో ఎవరో మధ్యవయస్కుడు వొచ్చాడక్కడికి. బండివాలాను ప్రాధేయపడ్డాడు. "మా కుక్కని తెచ్చేశారు బాబూ వొదిలెయ్యవూ? మాకు ఒకే ఒక్క అబ్బాయి వాడు జిమ్మీ అనే కుక్కని పెంచుకుంటున్నాడు ఆ కుక్కని నువ్వు పట్టుకుపోతే మా వాడు బెంగపెట్టుకుంటాడు. జ్వరం పడిపోతాడు. వాడికి జ్వరమొస్తే వాళ్ళమ్మ తల్లడిల్లి పోతుంది. నేను దిగులు పడిపోతాను... అందరమూ ప్రమాదంలో పడతాం..."

జిమ్మీ కాబోలు... యజమాని వొచ్చినట్లు వాసన పసికట్టిందేమో .. బోను ఊచలలోంచి తల బయట పెట్టి ఏడుస్తూంది నన్ను రక్షించవూ అన్నట్లు యజమాని వేపు చూస్తూ... కంటనీరు పెడుతూ.

"మీ కుక్కకి లైసెన్సుందా?"

"లేదుబాబూ... ఇవాళే డబ్బు కట్టేస్తాను"

"లాభం లేదు. లైసెన్సులేని కుక్కలు ఉండడానికి వీల్లేదు"

త్రుళ్ళిపడ్డాడు నిరుద్యోగి.

లైసెన్స్ ... డబ్బుకట్టి లైసెన్స్... దేనికి? దేనికి లైసెన్స్? బతకడానికా? జుత్తుమీద పన్నువేయడం (జిజియా?) నేరమందే చరిత్ర? ప్రాణం మీద పన్నా?

"పది రూపాయలివ్వండి. ఈసారికి వొదిలేస్తాను మీ ముఖంచూసి. సాయంత్రం లోగా లైసెన్స్‌కట్టి మీ జిమ్మీ మెడలో తగిలించండి. నేను మళ్ళీ వొచ్చేసరికి లైసెన్సు లేదో–" అప్పుడిక దయతలచనన్నట్టు చూసి – "లైసెన్స్ లేని కుక్కలుండడం మహానేరం" అని ముగించాడు.

"అలాగే బాబూ...అలాగే" పది రూపాయలిచ్చేశాడు పెద్దమనిషి.

బండివాడు – 'జిమ్మీ' అని పిలిచాడు ఆ కుక్కని మాత్రం – మిగిలిన వాటిని అంకుశంతో లోపలికి నెడుతూ... జిమ్మీని మాత్రం బయటకు వదిలాడు. యజమాని దానినెత్తుకుని – బండీవాలాకి కృతజ్ఞతలు చెప్పి శలవు తీసుకున్నాడు.

నిరుద్యోగి నివ్వెరపాటునుంచి తేరుకోలేదింకా.

అతను చూస్తుండగానేకుక్కలబోను నిండింది. అది ఇంకవొక్క కుక్కకూడా పట్టేటట్లు లేదు. విశాఖపట్నం పదమూడో నంబరు (ఇపుడు నంబరుమారిందేమో నంబరు మారినా నైజం మారదు. పేరుమార్చుకున్న మనిషిలాగ) సిటీబస్సులా ఉందచ్చంగా.

ఇంక అతను నిగ్రహించుకోలేక పోయాడు. అతనిది చిత్రమయిన బాధని చూడడం వలన కలుగుతున్న బాధ. అందుకే అది బాధకంటే బాధాకరమయిన బాధ.

"నేను రెండు..."

బోనులోంచి కుక్కల అరుపులు...

బండివాలా చుట్టూ కుక్కలని పట్టి తెచ్చిన కుర్రాళ్ళు.

అతను వాళ్ళకి డబ్బులిస్తున్నాడు. పట్టి తెచ్చిన కుక్క ఒక్కటికీ రెండురూపాయల చొప్పున పంపకం ఐపోగా కుర్రాళ్ళు దూరంగా వెళ్ళిపోయారు.

ఇంక నిగ్రహించుకోలేక పోతున్నాడు. మనిషిగా పుట్టి నిరుద్యోగి అయి అక్కడే అగిపోయిన 'అతను'

బండీవాడు డ్రైవర్‌ని పిలవబోతూంటే –

అతను తొందరపడి "వన్ మినిట్" అన్నాడతని దగ్గరగా వెళ్ళి.

"వాట్డుయు వాంట్?"

"నువ్వు... మీరు... ఎడ్యుకేటెడా?"

నవ్వాడు "ఇంగ్లీషెమ్మే-గోల్డు మెడలిస్టుని. అలా చూస్తారేం? నమ్మకం చాలడం లేదా? షేక్స్పియర్ కింగ్ లీర్... మిల్టన్స్ కోమస్... రాబర్ట్ బ్రౌనింగ్ ఆఫ్ స్కూల్ ఫిలాసఫీ, బర్క్ అడ్మండబర్క్-కన్సీలియేషన్ విత్ అమెరికా, బెర్ట్రాండ్ రస్సెల్, ఆల్డస్ హక్స్లీ ఏం కావాలో అడగండి చెబుతా."

అతని మొఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. పాలిపోయింది. ఎమ్మేగోల్డ్ మెడలిస్ట్, కుక్కలబండీ, తను - ఎమ్మే ఎకనమిక్సే... గోల్డ్ మెడలిస్టు కాదు.

"అంత చదువుకునీ యీ పని"

అతనడిగిన ప్రశ్నకు కుక్కల బండీవాలా నవ్వాడు. "వర్కీజ్ వర్షిప్. శ్రమయే గౌరవం. ఈ పని నా బ్రతుకు. ఎంత చదువుకున్నా మనిషి బ్రతుకుండాలి కదా?"

"ఇంతకంటె మంచిపని దొరకలేదూ, ఎమ్మే గోల్డు మెడలిస్టులు కదా మీరు?"

"మీరీదేశంలోనే - భారతదేశంలోనే ఉంటున్నారా? ఇక్కడ బూట్ పాలిష్ చేయడ్డానికి బి.ఏ. ఉండాలి. బస్‌కండక్టర్‌కి ఇంజనీరింగ్ డిగ్రీ అర్హత. కుక్కల బండి దొరకడం నా అదృష్టం!"

వ్యంగ్యం అర్థమయినా ఆశ్చర్యపోయాడతను "అదృష్టమా! ఈ ఉద్యోగం లభించినందుకు మీరు నిజంగా సంతోషిస్తున్నారా!"

"ఆహా, అమితానంద భరితుడినే అవుతున్నాను. ఎందుకంటే యీ పనిలో జీతం తక్కువ అయినా గీతం ఎక్కువ. అలాగని లంచంకాదు. ఎవరిముందూ చేయి జూపి అడుక్కోనక్కరలేదు. పీడించ నక్కరలేదు. కుక్కకింతని లెక్కకట్టి సంతకం చేయించుకు మరీ యిస్తుంది. ప్రభుత్వం... అదే... మునిసిపాలిటీ. కుక్కలకొద్దీ రొక్కం. కనుక - ఉద్యోగంలో ఉన్నా కష్టపడడానికి బుర్ర ఉపయోగించడానికి ప్రోత్సాహం ఉంటుంది. ఇలాగ అమలినంగా... ఉత్సాహంగా చేయగలిగే ఉద్యోగం దొరకడం అదృష్టం కాక ఏమిటి?"

"ఈ కుక్కలనేం చేస్తారు?" బ్యాక్‌గ్రౌండ్‌లో కుక్కల విషాదకంఠాలు..., శోక గీతాలు.

"చంపేస్తారు"

"ఆ!" తనే చంపేస్తున్నట్లు భయపడిపోయాడతను "ఎందుకూ?"

"న్యూసెన్స్... ఈ వీధి కుక్కలు... ఊరకుక్కలు ప్రజలకి న్యూసెన్స్ కలగజేస్తాయి. మనుషులని కరుస్తాయి. ఆహార పదార్థాలెత్తుకు పోతాయి. రాత్రులు అరుస్తూ నిద్రపట్టనివ్వవు. బాట సారులకి కాళ్లకడ్డం పడతాయి. తెగ కని పారేస్తాయి, పనీ పాటూ లేకుండా"

"కానీ... కుక్క విశ్వాసమయిన జంతువు. యజమానిని సేవిస్తుంది. దొంగలను పట్టుకుంటుంది. ఇంటికి కాపలాకాస్తుంది. పిల్లలతో ఆడుకుంటుంది. పోలీస్‌కి సాయపడుతుంది. మన భారతీయులకి కాలభైరవుడు దైవమే"

"మీరు చెప్పేది లైసెన్స్‌డ్ కుక్కల సంగతి... పెంపుడు కుక్కల విషయం వేరు"

"లైసెన్స్‌డ్... పెంపుడు... ఊర... వీధి... ఏదయినా 'కుక్క కుక్కే' ఆ జాతి కొక లక్షణముంటుంది."

"కాని, మనుషులకే ఖాళీ లేక చస్తూంటే భూమ్మీద?"

"మనిషీ - కుక్కా కూడా మొదట అరణ్యంలోనే వుండేవి. నేను మీకు చెప్పవలసిన వాడిని కాను. కానీ... అరణ్యం నుంచి ఊరికి వొచ్చిన మానవుడు మొదట తెచ్చుకుని మచ్చిక చేసుకున్నది

గుర్రాన్ననుకుంటాను. కుక్కని కూడా అతనే తెచ్చాడు. అహ్వానించి, దానిచేత సేవలు చేయించుకుందుకు..."

"ఔను, ఐతే? మీరనేదేమిటి?"

"అరణ్యంలో బతికే కుక్కని తెచ్చి ఊరినీ మనుషులకీ అలవాటు చేశాడు. ఇప్పుడు మనిషి తాలూకు పెంపుడు జంతువులయిని కుక్కలు అరణ్యంలో కూడా జీవించగలవనుకోను. పెరగవలసిన అడవులను మీరు అక్రమించుకుంటున్నారు. నాశనం చేస్తున్నారు. జంతువుల కోసం ఉండే అడవులని మనుషులాక్రమించుకుని వాటికి నిలువనీడ లేకుండా... ప్రశాంతంగా క్షేమంగా, జీవించనివ్వకుండా... ఆ వాతావరణాన్ని మానవులు కలుషితం చేస్తున్నారు. ఇది అన్యాయం, అక్రమం, ఇవాళ కుక్క... రేపు గోవు... ఎల్లుండి మేక... ఇలాగ మనుషులు ఎన్ని జీవజాతులని నాశనం చేయబోతున్నారు?" ఆవేశంగా అడిగాడు.

"మీరు – జీవకారుణ్య సంఘ సభ్యులా"

"కాదు. నేనేమీ కాదు. మనిషిని కూడా కాదేమో, నిరుద్యోగిని అంతే"

"జనాభా పెరిగిపోతూంది. భూభాగం స్థిరం, అది పెరగదు"

"తరుగుతుంది. సముద్రం చేత కొంచెం కొంచెంగా ఆక్రమించబడుతూ"

"కావచ్చు. భూమి తరుగుతుంది. జనాభా పెరుగుతుంది. మరి అలాంటప్పుడు జీవకారణ్యమంటూ కుర్చుంటే ఎలా? గదిలో మనుషులకే చోటు చాలనప్పుడు కుక్కలనీ, పిల్లులనీ కూడా ఎలా భరించడం?"

"అంటే చోటు చాలడం లేదని జంతువులని చంపేస్తున్నారు" అంతేనా అన్నట్లు చూశాడతను.

అంతేలే అన్నట్లు నిర్లక్ష్యంగా బదులు చూశాడు కుక్కల బండివాలా.

"భగవంతుడు అన్ని జీవులనీ బ్రతకమనే సృష్టిస్తాడు. బ్రతకడం జన్మనెత్తిన ప్రతి జీవికి ప్రాథమిక హక్కు. కానీ మనిషికి బలం ఉందని తనకంటె బలహీనమయిన జంతువులను చంపేస్తున్నాడు. జంగిల్‌లా. అరణ్య న్యాయం బలవంతుడిదే రాజ్యం. బలవంతుడిదే జీవితం ఇదేనా మన మానవ నాగరికతాభివృద్ధి? ఇదేనా మానవ పురోభివృద్ధి?

జాతులనే నాశనం చేసెయ్యడం స్వార్థం కొద్దీ... ఇదేనా ప్రగతి? ఆ కుక్కలను అరణ్యంలోనే ఉండనిస్తే ఆ జీవన పోరాటంలో – మనిషి కంటె బలవంతమైనవి మనిషిని చంపగలిగేవేమో! సర్వయివల్ ఆఫ్ ద ఫిట్టెస్ట్ థీరీ ప్రకారం. కాని మాయమనిషి– వీటినరణ్యం నుంచి తమలోకి తెచ్చి... కష్టపడకుండా అన్నం పెట్టినట్లు నటిస్తూ... అలాగ అలవాటు చేసి... వాటిని నిర్వీర్యం చేసి... చేతకాని వాటిని చేసి... యిప్పుడు యిలా చంపుతున్నాడు !

బార్న్ ఫ్రీ అంగ్లసినిమా, సింహపు పిల్లని తెచ్చి మొదటినుంచీ మనుషులలో పెంచితే – అది శాకాహారిలాగ – తన శౌర్యాన్నీ బలాన్నీ కోల్పోయి... వేటాడే శక్తినీ నైపుణ్యాన్నీ కోల్పోయి.. ముళ్ళపందిచేతే తరుమబడే స్థితికి దిగజారుతుంది. వాతావరణం – పెరుగుదల మీద ఎటువంటి ప్రభావం చూపగలిగేదో చక్కగా చూపించిన అద్భుత చిత్రం.

తరువాత దానిని సింహపు బతుకు బతికేలా చేయడానకి పెంచిన వాళ్ళు నానా బాధలూ పడతారు. చూశావా నువ్వు?"

"లేదుకానీ... నాకు పనుంది. కుక్కలనప్పగించి డబ్బులు తీసుకోవాలి ఆఫీసు నుంచి.

నిరుద్యోగినంటున్నావు. ఓ పని చెయ్యకూడదూ?"

"ఏమిటి?"

"ఈ దయలూ దాక్షిణ్యాలూ కడుపు నింపవు కానీ.. కుక్కలని పట్టినాకివ్వు. కుక్కకి రెండున్నర యిస్తాను"అని బండిని పొమ్మన్నాడు.

నిరుద్యోగి – కదలలేక పోయాడు.

కుక్కలు...కుక్కలు...కుక్కలు... చావబోయే.. ఉహుఁ... చంపబడబోయే...హత్య చేయబడబోయే కుక్కలు... కుక్కలు...కుక్కలు.

బోనులోంచి ఏడుస్తున్నాయి. వేడుకుంటున్నాయి. మొరపెట్టుకుంటున్నాయి, ఎదురు తిరగబోతున్నాయి. వాటికి తెలుసేమో తనను చంపేస్తారని. అందుకేయేమో ప్రాణభీతితో అలాగ కొట్టుకు పోతున్నాయి.

ఒక్కసారి త్రుళ్ళిపడ్డాడు నిరుద్యోగి, మనసులో ఏదో కొరడా ఝళిపించినట్లు భూమిమీద చోటు చాలడం లేదని...పబ్లిక్ న్యూసెన్సని...ఎంతో కొంత మానవులకు సేవచేసే కుక్కలనే యిలా చావుకి గురిచేస్తున్నారే... రేపు...జనాభా యింకా ఎక్కువై...జంతువులన్నీ ఖాళీ చేసినా మనుషులకే భూభాగం చాలకపోయినప్పుడు...

సమాజానికి పనికిరాని...పబ్లిక్ న్యూసెన్స్‌గా (నిరుద్యోగి పేరెంట్స్‌కీ న్యూసెన్సే. మనిషంతమనిషిని పోషించడం మాటలు కాదు. కూర్చునితింటే కొండలే తరుగుతాయిట) తయారయ్యే... నిరుద్యోగులను...

యిలాగే...బంధించి...బోనులోకి తోలి ఎదురుతిరిగితే అంకుశంతో పొడుస్తూ, ఏడుస్తున్నా వినిపించుకోక...ప్రాణభిక్ష పెట్టమని ప్రాధేయ పడుతున్నా పట్టించుకోక...పొడుస్తూ...బండిమీద మానవ కబేళా (కబేళా – జంతువులని వధించేచోటు) కి తీసుకువెళ్ళినసరికి పారేస్తారా? ఆ రోజు...ఆ దుర్దినం... ఆ భయంకర సమయం.. వొచ్చేస్తూందొచ్చేస్తూందొచ్చేస్తూంది...త్వరత్వరగా..శరవేగంతో వొచ్చేస్తూంది...వొద్దన్నా వొచ్చేస్తూంది. వొచ్చిపడిపోతూంది. బాబోయ్...నన్ను మనుషుల బండీలోకి తోసేస్తూంది...అదుగో...ఆ ఉద్యోగి...అంకుశంతో పొడుస్తున్నాడు ఉచ్చువేసి బిగించిన నా మెడని పట్టుకుని...కుక్కల బండీ...మనుషులబండీలోకి తోసేస్తున్నాడు. అమ్మో !...నాయనో...నన్నూరవతలకి మనుషుల కబేళాకి తీసుకుపోయి – నరికేస్తాడు!

నిలువునా కూలిపోయాడు నిరుద్యోగి – నట్ట నడిరోడ్డుమీద.

అతని కళ్ళముందు...మెదడులో...భరించలేనంత భయంకర దృశ్యాలు... దెయ్యాల్లా... భూతాల్లా... పిశాచాల్లా... మనుషుల్లా... భీకర నృత్యాలు చేస్తూ... వికటాట్టహాసాలతో... విలయ తాండవమాడుతున్నాయి యింకా.

✡ ✡ ✡ ✡ ✡

ఎయిర్‌కండిషన్ సుఖాన్ని ఊహించుకుంటూ కళ్ళు మూసుకోడంలోని అనుభూతి రాధ తనకు చెప్పాలా!

కడుపు మండితే ఆకలి, ప్రాథమిక ఆరోగ్యసూత్రాల నధిగమించగలదన్న చిన్న విషయం తెలియుని